

చురుగ్గా 3వ దశ రీసర్వే : కలెక్టర్

కడప : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న భూ రికార్డుల స్వచ్ఛీకరణ, రీ సర్వే పనులను జిల్లాలో మొదటి, రెండవ దశల్లో పూర్తిచేసి 3వ దశలోనూ పనులు చురుగ్గా సాగుతున్నాయని కలెక్టర్ వి.విజయ రామరాజు తెలిపారు. గురువారం విజయవాడలోని తన కార్యాలయం నుంచి రాష్ట్ర భూ పరిపాలనా శాఖ కమిషనర్ సాయిప్రసాద్ సంబంధిత శాఖల కార్యదర్శులతో కలిసి 'జగనన్న శాశ్వత భూ హక్కు – భూ రక్ష పథకం అమలు, రీ సర్వేలో భాగంగా స్టోన్స్ ప్లాంటేషన్, గ్రౌండ్ ట్రూథింగ్ మొదలైన అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జెసిలతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ వి.విజయ రామరాజుతో పాటు జెసి గణేష్ కుమార్, డిఆర్ఒ, గంగాధర గౌడ్ హాజరయ్యారు. విసి అనంతరం కలెక్టర్ జిల్లాలో జరుగుతున్న రీ సర్వే పనులను వివరించారు. కార్యక్రమంలో ల్యాండ్ సర్వే శాఖ ఇడి మురళీకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

'సెయిల్' ఉక్కుకు సమాధి

- కేంద్రంలోని బిజెపి సర్కారు ఝలక్
- స్పందించని అధికార, ప్రతిపక్ష పార్టీలు
- రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు సిపిఎం పిలుపు

ప్రజాశక్తి- కడప ప్రతినిధి/యంత్రాంగం

కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు కేంద్రంలోని బిజెపి సర్కారు సమాధి కట్టింది. 2014లో రాష్ట్ర విభజన సమయంలో అప్పటి యుపిఎ-2 సర్కారు కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని ప్రకటించిన సంగతి తెలిసిందే. 2014 సార్వత్రిక ఎన్నికల అనంతరం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి సర్కారు ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి పలురకాల సర్వేలు, టాస్క్‌ఫోర్స్‌ల పేరుతో అధ్యయనాలు చేయించింది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో మంగళవారం పార్లమెంటులో టిడిపికి చెందిన ఇద్దరు ఎంపీలు అడిగిన ప్రశ్నలకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యా



నందరాయ్ సర్వే సంస్థలు లాభసాటి కాదని తేల్చాయని, ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయడం కుదరదని కుండబద్దలు కొట్టినట్లు సమాధానం చెప్పడం విస్మయాన్ని కలిగించింది. ఉమ్మడి రాష్ట్ర హయాంలో ప్రయివేటు రంగంలో బ్రహ్మణి పేరుతో ఉక్కు పరిశ్రమ నిర్మాణ పనులు చేపట్టిన సంగతి తెలిసిందే. వివిధ రకాల కారణాలతో బ్రహ్మణి ఉక్కు పరిశ్రమ నిలిచిపోయింది. రాష్ట్రంలో నాయకత్వ బాధ్యతలు మారడంతో బ్రహ్మణి పరిశ్రమ కథ కంచికి చేరింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర విభజన హామీలు, కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు ప్రధానాంశాలుగా మారడం తెలిసిందే. అప్పటి టిడిపి సర్కారు నిర్లక్ష్యం వెరసి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలో వైసిపి సర్కారు అధికారంలోకి వచ్చింది. 2019 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు వైసిపి అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు కసరత్తు చేశారు. ఇందులోభాగంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రముఖ ఉక్కు దిగ్గజ సంస్థ జెఎస్‌డబ్ల్యు ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. కాగా రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు సిపిఎం పిలుపునిచ్చింది.

స్పందించని వైసిపి, టిడిపి, జనసేన

కేంద్ర హోంశాఖా సహాయ మంత్రి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష పార్టీలు టిడిపి, జనసేనలు స్పందించకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఉమ్మడిగా కూడబలుక్కుని తేడుదొంగలుగా మారినట్లు ప్రవర్తించడం శోచనీయం. ప్రతిపక్ష పార్టీలైన టిడిపి, జనసేనలు ప్రజల తరపున నిలబడకుండా మోడీ, అమిత్‌షా, గుజరాతీ వ్యాపారుల పక్షాన నిలబడడం ఆందోళనకరం.

కార్పొరేట్లకు కట్టబెట్టడమే లక్ష్యమా

దేశంలోని ప్రయివేటు, కార్పొరేట్లకు లాభసాటిగా కనిపించిన ఇనుప ఖనిజం ఎగుమతులు, ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, కార్యకలాపాలు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన సెయిల్‌కు ఎందుకు లాభసాటిగా కనిపించడం లేదనే చర్చ నడుస్తోంది. కేంద్రంలో బిజెపి పభుత్వం ఉద్దేశపూర్వకంగా రాష్ట్రంపై చిన్నచూపు చూస్తోందనే విమర్శ పెద్దఎత్తున వినిపిస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కేంద్రంలోని బిజెపి సర్కారు ద్రోహపూరిత వైఖరి పట్ల ప్రజానీకం అప్రమత్తం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు.

కేంద్రం పచ్చి అబద్దాల కోరు



కేంద్రంలోని బిజెపి సర్కారు సెయిల్ ఆధ్వర్యంలో కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు ఫీజుల బులిటీ లేదనడం పచ్చి అబద్దం. ఐరన్‌ఓర్‌తోపాటు ఉక్కు తయారీలో కీలక పాత్ర పోషించే సున్నం, నికెల్, డోలమైట్ వంటి కీలక మూలకాలు సైతం జిల్లాలో లభ్యమవుతుంది. దేశంలో ఉక్కు పరిశ్రమలు ఏర్పాటు చేసిన ప్రదేశాల్లో ఐరన్‌ఓర్ లేదు. కలకత్తాలోని బిలాయ్ ఉక్కు కర్మాగారం సమీపంలోనూ ఐరన్‌ఓర్ లేదు. ఫీజుబులిటీ లేకపోతే విశాఖ మొదలుకుని బ్రహ్మణీ, జెఎస్‌డబ్ల్యూలకు ఎలా లాభాలు వస్తాయని నిర్మాణాలు చేపట్టారో ప్రజానీకం అర్థం చేసుకోవాలి. కేంద్రం తరుపున ఎవరైనా డిబేట్‌కు వస్తే సమాధానాలు చెప్పడానికి సిద్ధంగా ఉన్నాం. జిల్లాలో మొదటి గ్రేడ్ ఐరన్‌ఓర్ 75 నుంచి 70, 40 రకాలుగా గ్రేడ్ క్వాలిటీ వరకు లభిస్తోంది.

- బి.నారాయణ, ఉక్కు సాధన కమిటీ కన్వీనర్, కడప.

ఇది ఒక మోసపూరిత ఎత్తుగడ



కడపలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయడానికి వయబులిటీ లేదనడం ఓ మోసపూరిత ఎత్తుగడ. జపాన్‌లో బిగ్‌హెడ్స్ (ఉక్కు గనులు) లేకపోయినప్పటికీ ఓబుళాపురం ఐరన్ ఓర్‌ను తీసుకుని క్వాలిటీ ఐరన్ ఉత్పత్తులు చేయడం జరుగుతోంది. కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయలేమని చెప్పడం దారుణం. రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేనలు రాష్ట్ర ప్రజల వైపా, మోడీ, షా, గుజరాతీ వ్యాపారుల వైపా అనేది తేల్చుకోవాలి. కేంద్ర మోసపూరిత వైఖరికి నిరసనగా రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహిస్తున్నాం.

- చలసాని శ్రీనివాస్, ప్రత్యేక హోదా సాధన సమితి రాష్ట్ర కన్వీనర్, విజయవాడ.

తీరని ద్రోహం



కడపలో స్టీల్ ప్లాంట్‌కు ఇప్పటిదాకా ముగ్గురు ముఖ్య మంత్రులు నాలుగుసార్లు శంకు స్థాపనలు, భూమి పూజలు చేశారు. యుపిఎ, ఎన్‌డిఎ రెండూ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్న విభజన హామీని నెరవేర్చకుండా జిల్లాను మోసం చేశాయి. కేంద్రం స్టీల్ ప్లాంట్ ఏర్పాటు సాధ్యం కాదంటోంది. పర్యావరణ అనుమతులు ఇవ్వడం లేదు. ఇక్కడ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు అన్ని రాజకీయ పార్టీల హామీ, దాన్ని సాకారం చేయడం విభజనవాదుల అందరి బాధ్యత. జిల్లా ప్రజల ఆకాంక్షలు నెరవేర్చకపోతే కేంద్రం లోని ఎన్‌డిఎ ప్రభుత్వం మాత్రం తగిన మూల్యం చెల్లించక తప్పదు.

-ఎ.రఘునాథరెడ్డి, కడప

ఎపి పట్ల చిన్నచూపే



మొదటి నుంచి కేంద్రంలోని బిజెపి సర్కారుకు రాష్ట్రం పట్ల చిన్నచూపు చూస్తోంది. కడపలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయడం పట్ల చిత్తశుద్ధి లేకపోవడమే కారణం. రాయలసీమ డిక్లరేషన్ పేరుతో చెప్పిన మాటలు గాలికి పోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఇటీవల పురంధేశ్వరి సైతం మోసపూరిత మాటలే మాట్లాడడం ఆందోళనకరం. పార్లమెంటులో చెప్పిన మాటలకే విలువ లేకుండా పోయింది. ఉక్కు పరిశ్రమలు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో ఎటువంటి ముడిసరుకులు లేకపోయినా ఏర్పాటు చేసి, అన్ని వనరులు కలిగిన కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయకపోవడం శోచనీయం.

- సి.హెచ్.చంద్రశేఖర్‌రెడ్డి, కార్మిక, కర్షక ఉద్యమ నాయకులు, కడప.

ఫీజుబులిటీ పేరుతో ద్రోహం



రాష్ట్ర ముఖచిత్రాన్నే మార్చే అవకాశం కలిగిన ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయడానికి ఫీజుబులిటీ లేదనే పేరుతో కేంద్రంలోని బిజెపి సర్కారు ద్రోహం చేస్తోంది. పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన ప్రధాన హామీకి నిలువునా తూట్లు పొడిచింది. దేశంలో ఐరన్‌ఓర్ లభ్యతకు వందలాది కిలోమీటర్ల దూరంలో పరిశ్రమలు ఏర్పాటు చేయడం లాభదాయకమైనది. ఐరన్ ఓర్‌తోపాటు నికెల్, డోలమైట్ ఇతర ఖనిజాలు కలిగిన ప్రాంతంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయడానికి వయబులిటీ కాదనడం దారుణం.

జి.చంద్రశేఖర్, సిపిఎం, జిల్లా కార్యదర్శి, కడప.

చావు కబురు చల్లగా..



కడప ఉక్కు కర్మాగారంపై కేంద్రం వాలకం చావు కబురు చల్లగా చెప్పినట్లు ఉంది. కడప జిల్లాలో ఉక్కు కర్మాగారం నెలకొల్పేందుకు అన్ని హంగులతో పాటు వనరులు సమృద్ధిగా ఉన్నాయి. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి పాలనలో కడప ఉక్కు కర్మా గారం బుట్టదాఖలైందని. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం, షెడ్యూల్డ్ 13 ప్రకారం కేంద్ర ప్రభుత్వం కడప జిల్లాలో సెల్ ఆధ్వర్యంలో ఉక్కు కర్మాగారం 6నెలల లోపు నిర్మించాల్సి ఉంది. తొమ్మిదిన్నర సంవత్సరాలైన అతీగతి లేదు. రాష్ట్రానికి బిజెపి ఒక శనిగ్రహం లాగా దాపురించిందని చెప్పారు. రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం కూడా ఉక్కు కర్మాగారంపై నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది.

- ఎన్.తులసిరెడ్డి, పిసిసి మీడియా చైర్మన్, కడప.

రాయలసీమకు ద్రోహం చేసిన బిజెపి



కడపలో ఉక్కు పరిశ్రమ స్థాపించలేమని కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రకటించి రాయలసీమకు ద్రోహం చేసింది. విభజన చట్టంలో భాగంగా రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక నిధులు, కడపలో ఉక్కు పరిశ్రమ, కేంద్రీయ విశ్వవిద్యాలయం, కేంద్ర ప్రభుత్వ సంస్థలు స్థాపించాల్సి ఉంది. బిజెపి ప్రభుత్వం తొమ్మిది సంవత్సరాలుగా వీటిని అమలు చేయకుండా రాయలసీమకు తీరని ద్రోహం చేసింది. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా పార్లమెంటులో ప్రకటన చేస్తుంటే రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న అధికార, ప్రతిపక్ష పార్లమెంటు సభ్యులు మాట్లాడకుండా కూర్చోవడం బిజెపికి సాగిలపడటమే.

- పి.శ్రీనివాసులు, సిపిఎం జిల్లా కార్యదర్శి, అన్నమయ్య.

ప్రజలు తగిన బుద్ధి చెబుతారు



కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన కడప జిల్లాలో విభజన హామీ మేరకు ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని పార్లమెంటులో నాయకులు బల్ల బుద్ధి చెప్పారు. అధికారంలోనికి వచ్చి 9 సంవత్సరాల అవుతున్న స్టీల్ ప్లాంట్‌పై స్పష్టమైన వైఖరి ప్రకటించలేదు. కేంద్ర సహాయ మంత్రి కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయము అని ప్రకటించడం ప్రజలను మోసగించడమే. తగిన సమయంలో బిజెపి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెబుతారు.

- సయ్యద్ సలావుద్దీన్, సంఘ సేవకులు, కడప.

విభజన హామీలకు తిలోదకాలు



ప్రభుత్వ రంగంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం జిల్లావ్యాప్తంగా పార్టీలకతీతంగా ప్రజలు ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున సాగించిన పోరాటానికి నాటి యుపిఎ ప్రభుత్వం కడప ఉక్కు పరిశ్రమ రాష్ట్ర విభజన చట్టంలో చేర్చింది. అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం విభజన హామీలకు తిలోదకాలు ఇచ్చింది. ఎన్నికల ముందు వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో ఎక్కువ పార్లమెంట్ స్థానాలు ఇస్తే కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి కడప ఉక్కు పరిశ్రమ తీసుకువస్తామన్నారు. స్వార్థ రాజకీయాల కోసం రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను కేంద్రానికి తాకట్టు పెట్టారు. ఉక్కు పరిశ్రమ స్థాపనకు అవస రమైన మౌలిక వసతులు కేంద్రానికి కనిపించకపోవడం దుర్మార్గం

-చంద్ర, జిల్లా కార్యదర్శి, సిపిఐ, కడప.

సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి

- డివైఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి బి.మనోహర్ డిమాండ్
- డివైఎఫ్ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో నిరసన



కడప : పాతబస్టాండ్‌లో నిరసన తెలియజేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో స్టీల్‌ప్లాంటు సాంకేతికంగా, ఆర్థికంగా లాభదాయకం కాదని కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రకటించడం రాష్ట్ర ప్రజలను మోసగించడమే అని భారత ప్రజాతంత్ర యువజన సమైఖ్య డివైఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి బి. మనోహర్, నగర కార్యదర్శి డి. ఎం. ఓబులేసు అన్నారు. గురువారం పాత బస్టాండ్‌లోని పూలే సర్కిల్లో డివైఎఫ్ఐ నగర్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడపలో రాష్ట్ర ప్రభుత్వమే సొంతంగా కార్మాగారం నిర్మిస్తుందంటూ ఆర్భాటంగా శంఖుస్థాపన చేసినప్పటికీ ఇప్పటికీ దానికి అతీగతీ లేదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా పార్లమెంటులో ప్రకటన చేస్తుంటే రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న అధికార, ప్రతిపక్ష పార్లమెంటు సభ్యులు మారు మాట్లాడకుండా కూర్చోవడం విడ్డూరమని వాపోయారు. కడప ఉక్కు పరిశ్రమపై కేంద్రం మోసకారితనం బట్టబయలైందని తెలిపారు. పార్లమెంటులో కేంద్ర హోమ్ సహాయ మంత్రి ప్రకటన డివైఎఫ్ఐ ఖండిస్తుందన్నారు. కడప ఉక్కు పరిశ్రమ సాధ్యం కాదన్నా కేంద్రం ప్రకటనపై రాష్ట్ర ప్రభుత్వం వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2014 పార్లమెంటు సాక్షిగా రాష్ట్ర విభజన చట్టంలో దేశంలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతాలలో కడప జిల్లా ఒకటని, ఆ ప్రాంత ప్రజల అభివృద్ధికి ఉక్కు పరిశ్రమ దోహదపడుతుందని చిలక పలుకులు పలికి, ఇప్పుడు తిరిగి పార్లమెంటులోనే అది సాధ్యం కాదని చెప్పడం సమంజసం కాదన్నారు. ఇది రాయలసీమ ప్రజలను తీవ్రంగా నయా వంచన గురి చేయడమేనని విమర్శించారు. నిత్యం వలసలు, ఆత్మహత్యలు, కరువు తో అలాడుతున్న సీమ కు ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష ఉద్యోగాలు వస్తాయని, నిరుద్యోగ యువతీ, యువకులు ఎదురుచూస్తు ఉంటే వారి ఆశలపై బిజెపి ప్రభుత్వం నీళ్లు చల్లిందని మండిపడ్డారు. కడప జిల్లాలో బ్రాహ్మణి స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాల్సిన బిజెపి తమ బాధ్యతనుంచి తప్పించుకోవడం సరికాదన్నారు. తక్షణమే బ్రాహ్మణి స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తు ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ మాజీ జిల్లా నాయకులు అన్వేష్, దస్తగిరి రెడ్డి, చంద్రారెడ్డి, పాపిరెడ్డి, రామకృష్ణారెడ్డి, నగర ఉపాధ్యక్షులు విజయ్, నాయకులు ఉదయ్, ఇమామ్, ప్రభాకర్ పాల్గొన్నారు. **బద్వేలు :** కడప ఉక్కు పై కేంద్ర ప్రభుత్వం మరోమారు యువతను మోసం చేసిందని, కేంద్ర ప్రభుత్వ వైఖరి పట్ల విద్యార్థులు, యువకులు పోరాటాలకు నాంది పలకాలని అలాగే రాష్ట్రానికి సంబంధించినటువంటి ఎంపీలు తమ పదవులకు రాజీనామా చేసి కేంద్ర ప్రభుత్వంపై ఉక్కు పరిశ్రమ కోసం పోరాటాలు చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని అన్నారు. గురువారం స్థానిక డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్కే మస్తాన్ షరీఫ్, గంగనపల్లి నాగార్జున, మహిళ కన్వీనర్ సి గురుదేవి , ఉపాధ్యక్షులు సురేంద్ర, సురేష్, సహాయ కార్యదర్శులు ఆంజనేయులు, గురయ్యా, సుబ్రహ్మణ్యం, సిద్దయ్య పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వం సాధ్యం కాదని పార్లమెంటులో చెప్పడాన్ని డివైఎఫ్ఐ తీవ్రంగా ఖండిస్తోందని ఆ సంఘం జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక పాత బస్టాండ్ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శివ కుమార్ మాట్లాడుతూ కడప ఉక్కు ఐదు కోట్ల ఆంధ్రుల హక్కు అన్నారు. విభజన చట్టంలో స్పష్టంగా కడపకు ఉక్కు పరిశ్రమ ఏర్పాటు అని ఉన్నా కేంద్రంలోని బిజెపి ఇంత వరకు ఏర్పాటు చేయలేదన్నారు. పార్లమెంటు సాక్షిగా కడపకు ఉక్కు ఏర్పాటు చేస్తామని నాడు చెప్పి, బిజెపి నేడు అది సాధ్యం కాదని కేంద్ర సహాయ మంత్రి చెప్పడం ఘోరమన్నారు. రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు సైతం పార్లమెంటులో కడప ఉక్కుపై కేంద్రాన్ని నిలదీయలేక పోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా పాలకవర్గ పార్టీలు ఇక్కడి ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, సూరి, రాఘవ, సురేంద్ర, అరుణ్, సుభహన్ పాల్గొన్నారు.

గంజాయి మూలాలపై దృష్టి పెట్టాం

ఎస్ఐ పోస్టుల రిక్రూట్‌మెంట్‌కు కసరత్తు
ప్రతి జిల్లాలోనూ సైబర్ క్రైం కౌంటర్లు
విలేకరుల సమావేశంలో డిజిపి రాజేంద్రనాథరెడ్డి

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

రాష్ట్రంలో గంజాయి స్మగ్లింగ్ మూలాలపై దృష్టి పెట్టామనీ, పొరుగు రాష్ట్రమైన ఒరిస్సా నుంచి స్మగ్లింగ్ రవాణా నిరోధానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని డిజిపి రాజేంద్రనాథరెడ్డి పేర్కొన్నారు. గురువారం వైఎస్ఆర్ జిల్లాలోని ఎస్పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండేళ్లుగా గంజాయి స్మగ్లింగ్ నివారణకు పోలీసులు దృష్టి సారించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సైబర్‌క్రైమ్ నివారణకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 26 వేల మంది మహిళల మిస్సింగ్ అవాస్తమని చెప్పారు. 2019 నుంచి 2021 వరకు చోటుచేసుకున్న మిస్సింగ్ కేసులు తాజా ఎన్‌సిఆర్‌బి నివేదికలో కలిపిన కారణంగా పెరుగుదల కనిపిస్తోందని వివరించారు. ప్రకాశం, నెల్లూరు, బాపట్ల జిల్లాలో ఇటీవల చోటుచేసుకున్న అల్లర్లు పునరావృతం గాకుండా చూడాలని ఆదేశించామని చెప్పారు. మహిళా పోలీస్ వ్యవస్థను బలోపేతం చేశామన్నారు. ఫలితంగా మహిళలపై వేధింపులు తగ్గుముఖం పట్టాయని తెలిపారు. దీనికితోడు దిశా చట్టం అమలు కారణంగా మహిళలకు రక్షణ కల్పించా మన్నారు. 100 మహిళల వేధింపుల కేసుల్లో శిక్షలు పడేలా చేశామని చెప్పారు. లోక్‌అదాలత్‌ల్లో 1.07 లక్షల కేసులు పరిష్కారమయ్యా యన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని రకాల చర్యలు తీసు కున్నామని తెలిపారు. చోరీలు, మహిళల వేధింపులు, హత్యలు, హత్యాయత్నం కేసులు నాలుగు శాతం మేరకు తగ్గాయని తెలిపారు. ఎస్ఐ, సిఐ ప్రమోషన్లు చేపడతామని తెలిపారు. కానిస్టేబుల్ పోస్టుల నియమకం కోర్టు పరిధిలో ఉండడంతో చేపట్టలేకపోతున్నామని తెలిపారు. కడప, అన్నమయ్య జిల్లా పోలీసుల పనితీరు భేషుగ్గా ఉందన్నారు. మూడేళ్లతో పోలిస్తే క్రైం రేట్ చాలా తగ్గిందని చెప్పారు. కేసుల గణాంకాల ఆధారంగా విమర్శలు చేస్తే బాగుంటుందని తెలిపారు. కడప జిల్లాలో 2.1 శాతం నుంచి 1.7 శాతానికి, అన్నమ య్య జిల్లాలో 15 శాతానికి తగ్గిందని చెప్పారు. విలేకరుల సమావేశంలో కడప, అన్నమయ్య జిల్లాలు ఎస్పీ అన్బురాజన్, గంగాధర్‌రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిజిపి రాజేంద్రనాథరెడ్డి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జి.పి.డి. క్రిష్టి

అన్ని రంగాల్లో పిల్లలు అభివృద్ధి

కడప : అన్ని రంగాల్లో పిల్లలు అభివృద్ధి చెందేందుకు జాతీయ విద్య విధానం-2020 ముఖ్య ఉద్దేశమని హైదరాబాద్ కెవి సిఆర్‌పిఎఫ్ ప్రిన్సిపల్ జి.పి.డి. క్రిష్టి, కడప కేంద్రీక విద్యాలయ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ బి. పద్మజారాణి పేర్కొన్నారు. గురువారం కడప కేంద్రీయ విద్యాలయలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో హైదరాబాద్ కెవి ప్రిన్సిపల్ మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం 2020 అమలు చేసి మూడేళ్లవుతున్న సందర్భంగా వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడవ వార్షికోత్సవానికి సంబంధించి ప్రధాని ఈనెల 29న న్యూఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో రెండవ అఖిల భారతీయ శిక్ష సమాజాన్ని ప్రారంభించి ప్రసంగిస్తారని తెలిపారు. కడప కేంద్రీయ విద్యాలయ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ మాట్లాడుతూ కడప కేంద్రీయ విద్యాలయం పిఎంశ్రీకి ఈ విద్యా సంవత్సరం ఎంపిక కావడం సంతోషించదగ్గ విషయం అన్నారు. దీని ద్వారా స్కూలు అభివృద్ధికి నిధులు వస్తాయని తెలిపారు. స్కిల్ హబ్ ఇన్సియేటివ్‌కు కూడా కడప కేంద్రీయ విద్యాలయం ఎంపికైందని చెప్పారు. దీని ద్వారా పదవ తరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన వారికి ఏదైనా ఉద్యోగ అవకాశాలకు శిక్షణ ఇస్తారని తెలిపారు. యుకెజికి సంబంధించి క్లాసులు ఈనెల 31 నుంచి ప్రారంభమవుతాయని సమావేశంలో మౌంట్ ఫోర్త్ స్కూల్ ప్రిన్సిపల్ అమల్ రాజ్, వివేకానంద విద్యానికేతన్ ఆంగ్ల ఉపాధ్యాయిని ఎస్. వి. పద్మలత పాల్గొన్నారు.

రవికిషోర్‌రెడ్డికి డాక్టరేట్ ప్రదానం

వల్లూరు : మండలంలోని గంగన్నపల్లి గ్రామానికి చెందిన రవి కిషోర్‌రెడ్డికి డాక్టరేట్ లభించింది. దేశంలోని ప్రతిష్టాత్మక సంస్థల్లో ఒకటైన ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, హైదరాబాద్ డాక్టర్ ఆఫ్ ఫిలాస్పి పట్టా గురువారం అందుకున్నారు. ఆయన ప్రస్తుతం కడపలోని కె ఎస్ఆర్ ఎం ఇంజినీరింగ్ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా , ఫ్యాకల్టీ డీన్‌గా పనిచేస్తున్నారు.

అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం బాధాకరం

కడప అర్బన్ : జిల్లాలో వైసిపి నాయకులు చేస్తున్న భూదందాలు, ఖనిజ, ఇసుక దోపిడీ, మట్టి మాఫియా అరాచకాల పై ప్రధాన ప్రతిపక్ష పార్టీగా డిజిపికి వివరించేందుకు అపాయింట్‌మెంట్ ఇవ్వక పోవడం బాధాకరమని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం పోలీస్ గెస్ట్ హౌస్ వద్ద మీడియాతో మాట్లాడారు. వైసిపి నాలగేళ్ల పాలనలో ఎన్నో అక్రమాలు, అరాచకాలు, దౌర్జన్యాలు, భూ దోపిడీ, హత్యలు చోటు చేసుకున్నాయని పేర్కొన్నారు. పట్టపగలు నడిరోడ్డుపై వైసిపి నాయకుని ఘర్షణకు దిగి ఒక వ్యక్తి హత్యకు కారణమైతే టిడిపి నాయకుడిని అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. 6 ఆరు నెలలలో ప్రభుత్వం పతనం ఖాయమని జోష్యం చెప్పారు.

'సమీకృత వ్యవసాయం'తో ఆదాయం రెట్టింపు

చింతకొమ్మదిన్నె : సమీకృత వ్యవసాయ పద్ధతుల ద్వారా ఆదాయం రెట్టింపు చేసుకోవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ వీరయ్య పేర్కొన్నారు. గురువారం స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం ఊటుకూరులో ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి14 విడత రైతుల ఖాతాలో ఒక్కొక్కరికి రూ. 2 వేల చొప్పున ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విడుదల చేస్తున్న సందర్భంగా కెవికెలో రైతులకు ప్రత్యక్ష వీక్షణ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మహేష్ బాబు మాట్లాడుతూ సమీకృత వ్యవసాయ పద్ధతులు, వాటి ఆవశ్యకత గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ శిల్పకళ, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ మురళీకృష్ణ, ఆత్మ పథక సంచాలకులు ఉపసంచాలకులు, విజయలక్ష్మి, పద్మలత, కెవికె శాస్త్రవేత్తలుమహేశ్వరి, మానస పాల్గొన్నారు.

కేసులకు శాశ్వత పరిష్కారం

కడప : శాశ్వత లోక్ అదాలత్ లో సామరస్య పూర్వకంగా పరిష్కారం ఉంటుందని శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణ ప్రసాద్ అన్నారు. గురువారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ పి. అన్నపూర్ణ ఆదేశాల మేరకు జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్ భవన్‌లో ప్రజా ప్రయోజత, న్యాయ సేవల పై అవగాహన సదస్సు అడిషనల్ సీనియర్ సివిల్ ఎం ప్రదీప్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ శాశ్వత లోక్ అదాలత్, పబ్లిక్ యుటిలిటీ సేవలను వివరించారు.

మణిపూర్ బాధితులకు న్యాయం చేయాలి

పోరుమామిళ్ల టౌన్ : మణిపూర్ ఘటనలో బాధితులను అక్కడి ప్రభుత్వం న్యాయం చేయాలని బుద్దిస్ట్ ఆఫ్ ఇండియా జిల్లా ఉపాధ్యక్షులు ఇండ్ల రామసుబ్బయ్య పేర్కొన్నారు. పట్టణంలో బుద్ధిష్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ భవనంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మతాలు, వర్గాలకు అతీతంగా ప్రభుత్వాలు శాంతియుత పరిస్థితులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో బుద్ధిష్టు జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఇండ్ల రాజమ్మ, స్వర్ణ రాజమ్మ, రిటైర్డ్ బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయ్ ఖాసింఖాన్, షేక్ నాగూర్ వలి,డప్పు కళా కారుల రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ పి. రామ లక్ష్మయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ

పోరుమామిళ్ల : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిజిటల్ ఇండియాలో భాగంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్మెంట్ విద్యలో భాగంగా మొదటి విడతలో విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లను గురువారం వైస్ ప్రిన్సిపల్ ప్రకాష్‌రావు ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పరిసర ప్రాంత పట్టభద్రులు ఈ స్కిల్ హబ్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సమావేశంలో అధ్యాపకులు వెంకటరావు, శ్రీధర్ మూర్తి, శివారెడ్డి, పీరయ్య, హరిబాబు, నరసింహా రెడ్డి, శిక్షకులు మోహన్ కుమార్, సుహాసిని, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి నాయకులు అమీర్‌బాషా

మారణ హోమం అమానుషం

ప్రజాశక్తి-కడప అర్బన్

దేశవ్యాప్తంగా మతోన్మాద శక్తుల దుశ్చర్యలను అరికట్టాలని, లౌకిక ప్రజాస్వామ్య దేశంలో అన్ని మతాలను సమానంగా చూడాలని టిడిపి కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జి వి.ఎస్. అమీర్ బాబు, కాంగ్రెస్ నాయకులు నజీర్ అహ్మద్ అన్నారు. గురువారం దేశంలో అనేక, వర్గాలు, జాతుల ప్రజలున్నారని గురువారం రహమతీయా ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన దైవ సేవకుల సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అమీర్ బాబు మాట్లాడుతూ అన్ని మతాలను సమానంగా చూడాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షులు షేక్. నజీర్ అహ్మద్ మాట్లాడుతూ క్రిష్టియన్ మతానికి, ఇస్లాం మతానికి దగ్గర సంబంధం ఉందన్నారు. మణిపూర్‌లో గిరిజనులపై జరుగుతున్న మారణ హోమాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ గౌరవ అధ్యక్షులు వైయస్ థామస్ రెడ్డి, స్పోర్ట్స్ అథా రిటీ డైరెక్టర్ డేనియల్, హోలీ జీసస్ క్రైస్ట్ కెథడ్రల్ చర్చి బిషప్ రెవ డాక్టర్ కె శ్యాముల్ బాబు, పాస్టరమ్మ రిబక, పాస్టర్ మల్లెం శేఖర్, డేవిడ్ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన పాస్టర్లు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

కాశినాయన : నరసాపురం జడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న కొండిశెట్టికి పిఆర్‌టియు యూనియన్ జిల్లా అధ్యక్షులు రమణ, ప్రధాన కార్యదర్శి రవిశంకర్ ఆధ్వర్యంలో ఆ పాఠశాల ఉపాధ్యాయులు గురువారం విరామ సమయంలో శాలువలతో పూల మాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పిఆర్‌టియు నాయకులు మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు కొండిశెట్టిట్టి నియోజకవర్గంలోనే నరసాపురం జడ్‌పి పాఠశాలకు ఫలితాల్లో పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చారని చెప్పారు. పాఠశాల ఖ్యాతీని జిల్లా స్థాయికి తీసుకెళ్లేలా తీర్చిదిద్దారని పేర్కొన్నారు ప్రధా నోపాధ్యాయుడు మాట్లాడుతూ పాఠశాలను అన్ని విధా లుగా అభివృద్ధి చేసి పదవ తరగతిలో మంచి ఉత్తీర్ణత శాతాన్ని సాధిస్తామని చెప్పారు. కార్పొరేట్ స్కూలుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాల ఫలితాల్లో మేటి అనిపి స్తామని చెప్పారు. ఉపాధ్యాయుల సహకారంతో తప్పక పాఠశాలకు ఖ్యాతీ తీసుకొస్తామన్నారు. కార్యక్ర మంలో ఆ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు



ప్రధానోపాధ్యాయుడిని సన్మానిస్తున్న నాయకులు

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల మున్సిపాలిటీ ప్రజలు చెత్తను చెత్త బండ్లకు అందించాలని, అలా కాకుండా రోడ్లపై ఇళ్లలోని చెత్తను వేస్తే రూ.5వేలు జరిమానా విధించనున్నట్లు మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ పేర్కొన్నారు. గురువారం సుజాత థియేటర్ సమీపంలోని రోడ్డులో ఇళ్లలోని చెత్తను వీధుల్లో వేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆ ప్రాంతాన్ని వారు అధికారులతో కలిసి పరిశీలించారు. చుట్టుపక్కల ఇళ్లలో ఉన్న వారికి రోడ్డుపై చెత్త వేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతిరోజు మీ ఇంటి వద్దకు వచ్చే చెత్త బం డ్లు అందించాలని సూచించారు. నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. వర్షా కాలం కావడంతో ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ హఫీజ్, అధికారులు పాల్గొన్నారు.



రోడ్డుపై వేసిన చెత్తను పరిశీలిస్తున్న చైర్మన్, మనోహర్‌రెడ్డి

మార్కెట్ యార్డులో అన్ని సౌకర్యాలు కల్పిస్తాం

పులివెందుల రూరల్ : మార్కెట్ యార్డులో పులివెందుల నియోజకవర్గ రైతులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని పులివెందుల మార్కెట్ యార్డు చైర్మన్ గోటూరు చిన్నప్ప పేర్కొన్నారు. గురువారం ఆయన కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నప్ప మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్లో టమోటాకు సం బంధించి కిలో రూ.100కు పైచిలుకు ఉండడంతో ఎంపీ దృష్టికి తీసుకువెళ్లి మార్కెట్ యార్డులో రూ.50కే ఇస్తున్నామన్నారు. మార్కెట్ యార్డు అభివృద్ధి పనులను ఎంపీ దృష్టికి తీసుకెళ్లామని, వాటిని పరిశీలిస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కూడా నిధులు కేటాయిస్తున్నారని పేర్కొన్నారు. ముందుగా మాజీ రాష్ట్రపతి అబుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మార్కెట్ యార్డ్ సిబ్బంది, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులు

ముద్దనూరు : స్థానిక వైసిపి కార్యాలయంలో భారతరత్న, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం ఆజాద్ చిత్ర పటం వద్ద గురువారం నివాళులర్పించారు. ఆయన వర్ధంతి సందర్భంగా వైసిపి మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు మధుసూదనరెడ్డి, రంగయ్య నాయుడు, సుబ్బయ్య, రవి కుమార్‌రెడ్డి, శ్రీను,పెద్దన్న, కిరణ్‌కుమార్‌రెడ్డి, రమణ, రామ్మోహన్ పాల్గొన్నారు.

కొత్త యాప్ విద్యార్థులకు ఎంతో ప్రయోజనం

పులివెందుల రూరల్ : లయోలా పాలిటెక్నిక్ కళాశాలలో ఫైనల్ ఇయర్ సీఏఈఈ చదువుతున్న పఠాన్ ముస్తకీమ్ తన ఆలోచనలతో కోడింగ్ ద్వారా విద్యార్థులకు ఉపయోగపడే యాప్‌ను కనుగొన్నారని.. ఇది ఎంతో ఉపయోగకరమని లయోలా పాలిటెక్నిక్ కళా శాల ప్రిన్సిపల్ బ్రిట్టో గురు వారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఈ యాప్ ద్వారా పరీక్షల రిజల్ట్ సమయంలో సర్వర్ బిజీగా ఉన్నప్పటికీ అయిదారు నిమిషాల్లో రిజల్ట్ పొందే అవకాశం ఉందన్నారు. కళాశాలలోని విద్యార్థుల వివరాలన్నీ తెలుసుకోవచ్చు అన్నారు. మార్కులు, శాతం, సబ్జెక్టుల వారీగా వివరాలు తెలుసుకునే వీలుందన్నారు. ఈ యాప్ పేరు మార్క్స్ ఫెచ్చేర్‌గా ఏర్పాటు చేసి శుక్రవారం లాంఛనంగా ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం విద్యార్థిని కరస్పాండెంట్ ఆంటోనీ స్వామి, వైస్ ప్రిన్సిపల్ విజయరాజు హెచ్ఓడి డి.విశ్వనాథరెడ్డి ప్రత్యేకంగా అభినందించి, హర్షం వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతూ చిన్నారి మృతి

సింహాద్రిపురం : మండలంలోని అంకాలమ్మ గూడూరులో పాము కాటుతో చిన్నారి భవ్య శ్రీ (4) మృతి చెందింది. సోమవారం అర్ధరాత్రి అన్నాచెల్లెలు అయిన నవ దీప్, భవ్యశ్రీలను పాము కాటు వేసిన సంగతి విధితమే. ఈ సంఘటనలో నవ దీప్ పులివెందులలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. భవ్యశ్రీ పరిస్థితి విష మంగా ఉండడంతో కడపలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. చికిత్స పొందు తూ బుధవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అన్నాచెల్లెలు మృతి తల్లిదండ్రులు రామాంజనేయులు, అనురాధతోపాటు కుటుంబ సభ్యుల రోదన వర్ణనాతీతంగా మారింది.

రాయితీ టమోటా కేంద్రం ఏర్పాటుకు వినతి

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్): ప్రొద్దుటూరులో ప్రభుత్వం రాయితీ టమోటా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని స్థానిక మార్కెట్ యార్డ్ అధికారి కార్యాలయంలో రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ములపాకు ప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ కార్మిక సమాఖ్య ప్రొద్దుటూరు అధ్యక్షులు అప్ప పోగుల యల్లయ్య, కార్యకర్త బాబు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రొద్దుటూరులో టమోటాల విక్రయం ఆశించినంతగా ఉండకపోవచ్చని, పట్టణ జనాభా తక్కువ ఉందని కార ణాలు చెబు తున్నారన్నారు. గతంలో ఎర్రగుంట్ల సబ్జీఫెడ్ ఇప్పించినప్పుడు అమ్మ కాలు బాగా జరిగాయన్నారు. ప్రొద్దుటూరు పట్టణ జనాభా కడప కంటే ఎక్కువగా ఉందని ఈ విషయాన్ని కూడా అధికారులు పరిశీలించాలని తెలిపారు. తక్షణం రాయితీ టమోటాల విషయంలో అధికారులు నిర్ణయం తీసుకోవాలని కోరారు.

చరిత్ర అధ్యాపకుడికి డాక్టరేట్

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చరిత్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న బత్తుల ఏకోనారాయణకు ఎస్వి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. చేశారు. 'సోషియల్ లైఫ్ ఇన్ ఆంధ్ర (1300ఎడి–1600ఎడి)పైన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ యం.ప్రయాగ పర్యవేక్షణలో పరిశోధన చేశారు. చెన్నూరు మండలం దౌలతాపురం గ్రామానికి చెందిన లక్ష్మయ్య, కోదండరామయ్య దంపతుల కుమారుడు.

పులివెందుల వాసికి..

పులివెందుల టౌన్ : పుట్టరాయునిపేటకు చెందిన గునిశెట్టి రాజ శేఖర్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఏలూరులోని విట్ సంస్థలో తిరిగే డిస్క్‌పై హైబ్రిడ్ నానోఫ్లూయిడ్ ప్రవాహంపై ఉష్ణ బదిలీ విశ్లేషణ పరిశోధన వ్యాసం సమర్పించినందుకు పట్టా ఇచ్చారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌ను వైసిపి విద్యా విభాగ అధ్యక్షుడు రామలక్ష్మారెడ్డి, పలువురు స్థానికులు అభినందించారు.

కళ్లున్న కబోది ప్రవీణ్ : వంశీధర్‌రెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు, చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇంత అభివృద్ధి జరుగుతున్నప్పటికీ టిడిపి ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి కళ్లున్న కబోదిలా మాట్లాడుతున్నారని 32వ వార్డు కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరు వాసులకు మొత్తం 24వేల గృహాలు మంజూరైతే వీటిలో 13795 ఇళ్లు పలు నిర్మాణంలో ఉన్నాయని గణాంకాలతో, ల్యాప్‌టాప్ ద్వారా వివరించారు. టిడిపి హయాంలో 8శాతం కూడా పూర్తికాని అమృత్ పథకాన్ని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి పట్టుపట్టి ప్రజలకు మంచినీటిసౌకర్యాన్ని సదుద్దేశంతో మిగిలిన 92 శాతం పూర్తి చేశారన్నారు. టిడిపి హయాంలో గాంధీ పార్కును నాశనం చేయాలని అనుకున్నారని, ఆదే గాంధీ పార్కును తమ ఎమ్మెల్యే నందనవనంగా తయారు చేశారని అన్నారు. పేదలకు రాజన్నభోజనం ద్వారా ఆకలిని తీర్చుతున్నారని తెలిపారు. కూరగాయల మార్కెట్, వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల, ఆర్టీసీ బ్రిడ్జి, ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. ప్రజలకు మేలు జరుగుతుంటే, కేసులు పెంచుకుని లోకేష్ వద్ద మార్కులు కొట్టేయాలన్నట్లుగా ప్రవీణ్ ఉద్దేశం అన్నారు. 2014–19 టిడిపి హయాంలో ఇంతకంటే అభివృద్ధి ప్రొద్దుటూరులో జరిగిందంటే రాజకీయాల నుండి తాము తప్పుకుంటామన్నారు.

'మిషన్ రాయలసీమ' ప్రయోజనకరం

పోరుమామిళ్ల : మిషన్ రాయలసీమ ద్వారా రాయలసీమకు ఎంతో ప్రయోజనం ఉంటుందని తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వేమల మహేంద్ర రెడ్డి పేర్కొన్నారు. గురువారం మేనిఫెస్టోను తెలుగు యువత మండల అధ్యక్షుడు సీత బాలాజీ ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి తిరిగి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి సీమను అభివృద్ధి బాట పట్టించేందుకు హామీ ఇస్తూ తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో భాగంగా విడుదల చేసిన మిషన్ రాయలసీమను అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ శ్రీశైలం బోర్డు మెంబర్ సీతా వెంకటసుబ్బయ్య, మేజర్ పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్, మాజీ సర్పంచ్ ఎస్ఎం బాషా, బద్వేల్ నియోజకవర్గ కమిటీ సెక్రటరీ కరీముల్లా, పట్టణ అధ్యక్షులు మస్తాన్ వలీ, మాజీ ఎంపీటీసీ ఖమామ్ హుస్సేన్, లేఖ మిషన్ షరీఫ్, టిడిపి నాయకులు సెట్టెం ప్రతాప్, రంతుల్లా, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మురుగు ఇలా.. వ్యాధులు వస్తే ఎలా..!



చిన్నపాటి వర్షానికి బురదగా మారిన పత్తూరులోని ఓ వీధి

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం కోట్లాది రూపాయల నిధులను ఖర్చు చేసి మౌ లిక సదుపాయాలు కల్పి స్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం వారి సమస్యలు పరి ష్కారానికి నోచు కోవడం లేదు. గ్రామాల్లో గతంలో వేసిన సిమెంటు రోడ్లు దెబ్బతిని అధ్వానస్థితిలో ఉన్నా ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టిం చుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. చిన్నపాటి వర్షం వస్తే మురుగు నీరు అంతా వీధుల్లో వచ్చి చేరుతుండడంతో దుర్వాసన వస్తోందని అల్లాడి పోతున్నారు. దోమలు వ్యాప్తి చెందితే వ్యాధులు పొంచి ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని పత్తూరు గ్రామంలోని వీధులు అధ్వా నంగా మారాయి. వర్షం వస్తే రాకపోకలు సాగించడానికి కష్టతరంగా మా రింది. సిమెంటు రహదారులు దెబ్బతిన్నా కొత్తదారులు ఏర్పాటుకు అధికారు లు చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి వర్షానికే వీ ధుల్లోకి వర్షపు నీరంతా పెద్ద ఎత్తున చేరి రోజుల తరబడి నిల్వ ఉంటోంది. మురుగు బయటికి వెళ్లేందుకు ఆస్కారం కూడా లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్యంపై ప్రత్యేకదృష్టి సారించి సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని, వర్షాకాలం ప్రారంభం కావడంతో అంటువ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అధికారులు, ప్రజా ప్రతినిధులను కోరుతున్నారు.

అభివృద్ధికి నోచుకోని పాతపాలెం

ప్రజాశక్తి -చాపాడు(మైదుకూరు)

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని పాతపాలెం గ్రామం అభివృద్ధికి దూరంగా ఉంది. గ్రామానికి వెళ్లేందుకు సరైన రహదారి కూడా అందుబాటులో లేదు. దీంతో గ్రామస్తులు వేరే మార్గాలను ఎంచుకొని ప్రయాణించాల్సి వస్తోంది. అలాగే గ్రామం లో సిమెంట్ రోడ్లు ఉన్నప్పటికీ మురుగునీరు రోడ్లపై నిలుస్తూ కంపు కొడుతోంది. చిన్నపాటి వర్షం పడినా వర్షపునీరు రోడ్డుపై నిలిచి దోమలు పెరుగుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. గ్రామంలో సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేసి డ్రయినేజీ వ్యవస్థను అభి వృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పాత పాలెం గ్రామం మైదు కూరు పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. అభివృద్ధిలో మాత్రం ఎంతో వెనుకబడి ఉంది. మున్సిపాలిటీ ప్రారంభ ఎన్నికల్లో ఈ వార్డు నుంచి ఏకగ్రీవంగా అభ్యర్థిని ఎన్నుకున్నప్పటికీ అభివృద్ధి ఆశించిన స్థాయిలో జరగలేదని స్థానికులు పేర్కొం టున్నారు. ప్రస్తుతం ఎన్నికైన ప్రజా ప్రతినిధులు, అధికారులు గ్రామంలో డ్రయినేజీ ఏర్పాటు చేసి గ్రామానికి వెళ్లేందుకు సరైన రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ వార్డు పరిధిలోని మరో గ్రామమైన సర్వాయిపల్లె నుండి మైదుకూరుకి వచ్చేందుకు నేషనల్ హైవే కింది భా గాన ఉన్న కల్వర్టులు వర్షపు నీరు నిలుస్తూ గ్రామస్తులు వచ్చేందుకు చాలా ఇబ్బందికరంగా మారింది. గతంలో అనేకసార్లు ప్రజలు మున్సిపాలిటీ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రోడ్డుపై పారుతున్న వర్షపునీరు, మురుగునీరు

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చాపాడు

వైసిపి అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందుతున్నాయని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని పెద్దగురవలూరు సచివాలయ పరిధిలో గురువారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యలు ఏవైనా ఉంటే పరిష్కరించేందుకు ప్రతి ఇంటికి వెళ్లి తెలుసుకుంటున్నామన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామాల్లోనే సిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు. పెద్ద గురువలూరుకు సంక్షేమం, అభివృద్ధి ద్వారా రూ.14.74 కోట్లు మంజూరైందన్నారు. శ్రీరాములపేట గ్రామంలో విద్యుత్ సమస్య ఉందని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. వర్షం నీరు నిలుస్తోందని, డ్రయినేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు. శ్రీరాములపేట ఎస్‌సి కాలనీలో లెవెన్ కెవి విద్యుత్ లైన్లు ఇళ్లపై వెళుతున్నాయని తెలిపారు. సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు, సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త నాగిరెడ్డి, ఎంపిపి లక్ష్మమయ్య, తహశీల్దార్ సుభాని, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, ఎఓ మ్యాగీ, అంగన్వాడీ సూపర్వైజర్ రాజ్యలక్ష్మి, ఎపిఎం వెంకటరమణ, మండల కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, గృహ సారథుల మండల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వేమారెడ్డి, సర్పంచ్ రాజేష్, నాయకులు ఓబుళరెడ్డి, జయసుబ్బారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, రమణయ్య, జయరామిరెడ్డి, సివి సుబ్బారెడ్డి, కిషోర్‌కుమార్‌రెడ్డి, బాల వేమారెడ్డి, సత్య వేమారెడ్డి, నాగిరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, సంజీవరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు శ్రీనువాసులరెడ్డి, ధనేశ్వర్ బాబు, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

నేడు ఓబురెడ్డిపేటలో 'గడపగడపకూ మన ప్రభుత్వం'

పెద్దగురువలూరు సచివాలయ పరిధిలోని ఓబుళరెడ్డి పేటలో శుక్రవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిపి టి.లక్ష్మమయ్య తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి పాల్గొంటారన్నారు. మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని, ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని ఎంపిపి ప్రజలను కోరారు. సచివాలయం సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, వాలంటీర్లు అందుబాటులో ఉండాలని సూచించారు.

ఇసుక అక్రమ రవాణాతో తాగునీటికి ఇబ్బందులు



ఇసుక రవాణాను అడ్డుకుంటున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె పాపాఘ్ని నదిలో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాతో తాగునీటి ఇబ్బందులు ఉత్పన్నమయ్యాయని టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ పేర్కొన్నారు. స్థానిక పాపాఘ్ని నదిలో నుండి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను గురువారం టిడిపి నాయకులు అడ్డుకున్నారు. నదిలో తీసిన గుంతలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతుల్లేకుండా ఇసుకను తరలిస్తున్నారని ఆరోపించారు. పట్టపగలే వేంపల్లె పాపాఘ్ని నది నుండి ఇసుకను దోచుకుపోతున్నారని తెలిపారు. రాత్రివేళల్లో కూడా అక్రమ ఇసుక రవాణాను కొనసాగిస్తున్నట్లు చెప్పారు. దీనిపై రెవెన్యూ, పోలీసు, గనులశాఖ అధికారులు తెలిసి కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తద్వారా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పార్టీ నాయకులకు కూడా ఇసుక దందాలో భాగాలు ఉండడంతోనే ఇసుక రవాణా దందా జోరుగా సాగుతున్నట్లు ఆరోపించారు. అక్రమంగా తరలించిన ఇసుక డబ్బులను వేంపల్లె గ్రామ పంచాయతీకి ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇసుక అక్రమ రవాణాకు అధికారులు అడ్డుకట్ట వేయకపోతే టిడిపి ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పివి రమణ, నల్లగారి కృష్ణారెడ్డి, శేషారెడ్డి, గొటూరు నాగభూషణం, ఇలియాస్, పోతిరెడ్డి శివ, మహబూబ్ షరీఫ్, అల్లాబకష్, హబీబ్, శివయ్య, ఈశ్వరయ్య, సంటెన్న, మాబువలి పాల్గొన్నారు.

వైసిపి పాలనలో రైతులకు అన్యాయం

ప్రజాశక్తి -ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

వైసిపి ప్రభుత్వ పాలనలో రైతులకు అన్యాయం జరుగుతోందని టిడిపి జిల్లా అధ్యక్షుడు లింగారెడ్డి విమర్శించారు. స్థానిక తన కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 93.2 శాతం రైతులు అప్పుల్లో ఉన్నారన్నారు. సగటున రూ.2.54 లక్షలు ఒక్కో రైతుపై అప్పు ఉందన్నారు. దేశంలో రైతు ఆత్మహత్యల్లో ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో ఉందన్నారు. కౌలు రైతుల ఆత్మహత్యల్లో ఎపి రెండో స్థానంలో ఉందన్నారు. రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ ఏర్పాటు చేస్తామన్న ప్రభుత్వం ఆ ఊసే లేదన్నారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలో శనగ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలేని స్థితిలో ముఖ్యమంత్రి ఉన్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులపై దృష్టి ఉంచాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పార్లమెంటరీ సెక్రటరీ సిద్దయ్య, టప్పబాషా పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తా సైనికుడిలా పనిచేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేసి పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాలని టిడిపి ఇన్ ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి పిలుపు నిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురు వారం జమ్మల మడుగు పట్టణ, మం డలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్లు, యూనిట్, బూత్ ఇం చార్జ్‌లతో ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ సమిష్టి కృషితో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉండాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ శివనాథ్‌రెడ్డి, సీనియర్ నాయకులు కాటిరెడ్డి, మండల అధ్యక్షుడు దేవగుడి యూత్ నాగేశ్వరరెడ్డి, నవనీశ్వర్‌రెడ్డి, కిరణ్ రాయల్, హనుమంతు నాయక్ పాల్గొన్నారు.

ఆ పార్టీల నేతలు రాజకీయ మరుగుజ్జులు : నజీర్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

మణిపూర్‌లో ఇంతగా మారణహోమాలు, అఘాయిత్యాలు జరుగుతున్నప్పటికీ ఖండించలేని, మానవత్వంలేని రాజకీయ మరుగుజ్జులా వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు తయారయ్యాయని కాంగ్రెస్ ఇన్‌ఛార్జి నజీర్ విమర్శించారు. పార్టీ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలు ప్రధాని మోడీకి భయపడుతున్నాయన్నారు. గుజరాత్‌లో జరిగిన అల్లర్లను, మారణహోమాన్ని మణిపూర్ మంటలు తలపిస్తున్నాయన్నారు. ప్రధాని పెదవి విప్పకపోవడం పిరికిచర్య అన్నారు. గిరిజనుల ముద్దుబిడ్డగా చెప్పుకునే రాష్ట్రపతి ద్రౌపదిముర్ము గిరిజనుల ఆడబిడ్డలను వివస్త్రలను చేసి ఊరేగించి అత్యాచారాలు చేసినా కళ్లు మూసుకొని ఉండడం దేశానికి మంచిది కాదన్నారు. మణిపూర్ గద్దెనెక్కి ఏలుతున్న బిజెపి డబుల్ ఇంజన్ సర్కార్‌ని వెంటనే రద్దు చేసి, రాష్ట్రపతి పాలన విధించాలని ఆయన కోరారు. నాయకులు జీలానిబాషా, సాల్మన్, భాస్కర్, రామాంజనేయులు పాల్గొన్నారు.

పనికి తగ్గ వేతనం ఇవ్వాలి

పులివెందుల రూరల్ : సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని స్థానిక అంబకపల్లి రోడ్‌లో ఉన్న ఎపి ఎస్‌పిడిసిఎల్ కార్యాలయంలో జెఎసి చైర్మన్ అశోక్‌బాబు. కన్వీనర్ జగన్మోహన్‌రెడ్డి కోరారు. వారి ఆధ్వర్యంలో గురువారం నల్ల బ్యాడ్జీలు ధరించి గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1999 నుంచి 2004 వరకు విద్యుత్ సంస్థల్లో నియమించబడిన ఉద్యోగులకు జిపిఎఫ్, మాస్టర్ స్కేల్ విధానం వర్తింపజేయాలన్నారు. పలు సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. రాష్ట్ర జెఎసి పిలుపుమేరకు ఆగస్టు 10 వరకు వివిధ రూపాల్లో నిరసన వ్యక్తం చేయనున్నట్లు తెలిపారు ఈ అరిసేవ నాయక్, బి గురుమోహన్, ఇంజనీర్ అసోసియేట్ అధ్యక్షుడు జగదీశ్వర్ రెడ్డి, డిప్లమా అసోసియేట్ అధ్యక్షుడు రమేష్, అసిస్టెంట్ ఏవో విజయలక్ష్మి, పులివెందుల డివిజన్ పరిధిలో పనిచేస్తున్న ఇంజనీర్లు, లైన్మెన్లు, సీనియర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు

ఆర్‌టిపిపిలో ఉద్యోగుల ధర్నా

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని ఆర్టిపిపిలో గురువారం మధ్యాహ్నం భోజనం విరామ సమయంలో ఆర్టిపిపి జెఎసి ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ ప్రధాన గేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2022 వేతన సవరణ, కాంట్రాక్ట్ కార్మికుల క్రమబద్ధీకరణ వంటి పలు ముఖ్యమైన డిమాండ్లతో రాష్ట్ర జేఏసీ విద్యుత్ యాజమాన్యం ద్వారా ఈ నెల 20న సమ్మె నోటీసు ఇచ్చామని తెలిపారు. ఇందులో భాగంగా మొదటి రోజు ఆర్‌టిపిపి జెఎసి ఆధ్వర్యంలో ధర్నా చేశామన్నారు. కార్యక్రమంలో ఉద్యోగ, కార్మిక యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి-కడప

దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న విద్యుత్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు, సమస్యలను పరిష్కరించేంత వరకు ఉద్యమం ఆగదని విద్యుత్ ఉద్యోగుల జిల్లా జెఎసి కన్వీనర్ ఎం. వి. చలపతి, ప్రధాన కార్యదర్శి ఎస్. కె. చాంద్‌బాష హెచ్చరించారు. రాష్ట్ర జెఎసి ఇచ్చిన పిలుపుమేరకు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలపై గురువారం మధ్యాహ్నం భోజన విరమణ సమయంలో జిల్లా విద్యుత్ ఉద్యోగుల జెఎసి ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ధర్నా కార్యక్రమం విద్యుత్ భవన్ ఎదుట నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్, అసోసియేషన్ నాయకులు ఎం యాకోబు, నాగ శేషారెడ్డి, ఫయాజ్, పురుషోత్తం, శివ భాస్కర్, భరణి కృష్ణ, అన్ని అసోసియేషన్ల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

విఆర్‌ఎలకు ఉద్యోగోన్నతులు కల్పించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్


విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షులు పి.నాగేంద్ర డిమాండ్ చేశారు. గురువారం పాతబస్టాండ్‌లోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం విఆర్‌ఎలకు ఉద్యోగోన్నతలు కలిగిస్తూ పే స్కేలు అమలు చేస్తుందని పేర్కొన్నారు. విద్యార్హత కలిగినటువంటి విఆర్‌ఎలకు ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖ, ఆయా శాఖల్లో ఉద్యోగోత్నతలు కల్పించిందని చెప్పారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి కూడా తమకూ ఉద్యోగోన్నతుల కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటపతి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరమణ, జిల్లా కోశాధికారి అశోక్ పాల్గొన్నారు.

పైడిపాలెంలో 2.81 టిఎంసి నీరు

- నేడు లోమడ చెరుకు నీటి విడుదల

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని పైడిపాలెం ప్రాజెక్టులో 2.81టిఎంసి నీరు ఉంది. ప్రాజెక్టు నుంచి ఈనెల 19న నీటిని కాలువల ద్వారా చెరువులకు విడుదల చేశారు. ప్రాజెక్టుకు గండికోట లిఫ్ట్ ఇరిగేషన్‌లోని రెండు పంపుల ద్వారా 600 క్యూసెక్కుల నీరు వస్తుండగా, కాలువల ద్వారా 200 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. డ్యాం సామర్థ్యం ఆరు టిఎంసి కాగా 2.81 టిఎంసి నీరు ప్రస్తుతానికి నిలువ ఉంది. మండలంలోని లోమడ చెరువుకు కాలువల ద్వారా నీటి విడుదలకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే పులివెందుల బ్రాంచ్ కెనాల్ పరిధిలోని తొండూరు, నారేపల్లి, గంగనపల్లి చెరువులకు వీటితో నింపారు. శుక్రవారం చెరువుకు నీటిని విడుదల చేస్తున్నట్లు జికెఎల్ఐ డిఇఇ శ్రీనివాస్ తెలిపారు.



నీటితో కళకళలాడుతున్న పైడిపాలెం ప్రాజెక్టు

దాతృత్వం చాటుకున్న 'రాచమల్లు'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి మరో మారు తన దాతృత్వాన్ని చాటుకున్నారు. స్థానిక ఉప్పరపల్లె పంచాయతీలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం కార్యకర్త బండి ప్రభాకర్‌రెడ్డి ఇంటికెళ్లి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఉప్పరపల్లె గ్రామ వైసిపి కార్యకర్త బండి ప్రభాకర్‌రెడ్డి మరణించిన విషయం తెలుసుకొన్న రాచమల్లు ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభాకర్‌రెడ్డి భార్య బండి పరిమళ, ఇద్దరు పిల్లల సంరక్షణకు రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి సానబోయిన శేఖర్ యాదవ్, సర్పంచ్ వెంకట రమణారెడ్డి, ఎంపిటిసి మాధవి, రాయలసీమ పోలీస్ కంప్లైంట్ అథారిటీ బోర్డు మెంబర్ కాకర్ల నాగ శేషారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



నగదు అందిస్తున్న సర్పంచ్ రమణారెడ్డి

ప్రగతి నిరోధకుడు సిఎం జగన్

- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రగతి నిరోధకుడిగా, రాయలసీమ ద్రోహిగా తయారు కావడం శోచనీయమని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తండ్రి బావి తవ్విస్తే కొడుకు పూడ్చినట్లుంది జగన్‌రెడ్డి వాలకం అన్నారు. రాయలసీమ సమగ్రాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ హయంలో నాటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను ఒప్పించి 50 శాతం కేంద్రం, 50 శాతం నిధులు రాష్ట్రం భరించేలా రూ.2706 కోట్లు అంచనాలతో 268 కిలో మీటర్ల పొడవు గల కడప–రాయచోటి–మదనపల్లె–బెంగళూరు నూతన బ్రాడ్‌గేజ్ రైలు మార్గాన్ని మంజూరు చేయించారన్నారు. రూ.359 కోట్లతో కడప–పెండ్లిమర్రి వరకు 21.30 కిలో మీటర్ల మేర పూర్తయిందన్నారు. రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా మ్యాచింగ్ నిధులు విడుదల చేయలేదన్నారు. రైల్వేశాఖ ఆ పనులు నిలిపేసిందన్నారు. 2021లో ప్రాజెక్టునే రద్దు చేయమని రాష్ట్ర ప్రభుత్వం లేఖ రావడంతో కేంద్ర ప్రభుత్వం కడప–బెంగళూరు ప్రాజెక్టును రద్దు చేసిందని తెలిపారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు సుబ్రమణ్యం, రామకృష్ణ, నరసింహారెడ్డి, అమర్, సుబ్బరాయుడు, శివ, నాగార్జున, వినయ్ పాల్గొన్నారు.

వ్యవసాయ పనులకు ప్రాధాన్యతనివ్వాలి

చాపాడు : ఉపాధిలో రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యతని వ్వాలని ఎంపిపి టి. లక్ష్మయ్య సూచిం చారు. ఉపాధి కార్యాలయ ఆవర ణలో సామాజిక తనిఖీ ప్రజావేదిక సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎక్కువగా కుందు, కెసి పరిధిలో సాగు భూములున్నాయని, ఉపాధి పనులు కూడా వారికి అవసరమైన విధంగా చేపట్టడం వల్ల ఉపయోగం ఉంటుందని తెలిపారు. అనంతరం గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు చేపట్టిన 1510 పనులకు సంబంధించి రూ.6.85 కోట్ల నిధులకుగాను నిర్వహించిన తనిఖీలో గుర్తించిన వివరాలను తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి హామీ చట్టం అదనపు పథక సంచాలకులు సి నాగరత్నమ్మ, జిల్లా విజిలెన్స్ అధికారి ఎల్. యోగాంజనేయరెడ్డి, జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారి విజయ భాస్కర్, సహాయ పథక సంచాలకులు ఎం.మైథిలి, ఎంపిడిఓ శ్రీధర్ నాయుడు, ఈఓపీఆర్డీ రాధా కృష్ణవేణి, ఉపాధి ఏపిఓ పద్మారాణి, ఈసీ ప్రియాంక, పీఆర్ ఏఈ ఈశ్వరయ్య, తనిఖీ సభ్యులు, ఉపాధి సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, ప్రజలు పాల్గొన్నారు.

జిలకర మసూర బియ్యం కౌంటర్లు ప్రారంభం

పులివెందుల రూరల్ : కిలో రూ.48కే జిలకర మసూరు బియ్యం కేంద్రాన్ని గురువారం పురపాలక ఇన్‌ఛార్జి వైయస్ మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ హాల్ గంగాధర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా జిలకర మసూర బియ్యం రూ.26కిలోల సంచి దాదాపు రూ.1650 ఉండడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు కొనలేని పరిస్థితి నెలకొందన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు మండి మర్చంట్ వారితో మాట్లాడి వారి సహకారంతో గురువారం పులివెందులలో మూడు ప్రాంతాల్లో రాయితీతో జిలకర మసూర బియ్యాన్ని అందిస్తున్నామన్నారు. ప్రతి లబ్ధిదారుడికి 10 కిలోల చొప్పున ఇస్తారన్నారు. ఈ అవకాశాన్ని పుర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ మాధవ కృష్ణారెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ గోవిందరావు మోరే పాల్గొన్నారు.

ఎల్‌సిడిసి సర్వే 99.3 శాతం పూర్తి

చక్రాయపేట : జిల్లాలో ఎల్‌సిడిసి సర్వే 99.33 శాతం పూర్తయిందని అడిషనల్ డిఎంహెచ్ఓ డాక్టర్ ఖాదర్ వలి పేర్కొన్నారు. మండలంలోని సురభి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖాదర్‌వలి మాట్లాడుతూ ఈ నెలలో జరిగిన ఎల్‌సిడిసి సర్వే వివరాలు తెలుసుకున్నారు. జిల్లాలో ప్రప్రథమంగా బాగా సర్వే చేశారని తెలిపారు. మొత్తం 168 అనుమానిత కేసులుగా గుర్తించారు. అనంతరం పిహెచ్‌సి రికార్డులను తనిఖీ చేశారు. ప్రతి వార్డు సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులను అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ శివప్రసాద్, డిపిఎమ్ఓ ఎంవి కృష్ణారెడ్డి, ఎంపీహెచ్ఈఓ రామకృష్ణ, శాంతమ్మ, సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పంట నమోదులో సలహాలు తీసుకోవాలి

చక్రాయపేట : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న ప్రతి పథకాన్ని పంట నమోదుకు ఆధారమని, పంట సాగు చేస్తున్న ప్రతి రైతు ఇ క్రాప్ బుకింగ్ ద్వారా పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి నవంత్ బాబు సూచించారు. కె.రాజుపల్లె గ్రామంలో శంకర్‌రెడ్డి అనే రైతు వరి నాట్లు వేసే చోటికి వెళ్ళి సూచనలిచ్చారు. వరిలో కాలిబాటల ఉపయోగం గురించి రైతులకు వివరించారు. పంటకు గాలి వెలుతురు పుష్కలంగా అందినట్లయితే మంచి దిగుబడినిస్తుందని తెలిపారు. వరి పంట కొన భాగంలో కాండం తొలిచే పురుగు గుడ్డును పెడుతుందని కొనలను తుంచి నాటడం వలన భవిష్యత్తులో తెల్ల కంకి సమస్యను నివారించవచ్చు అన్నారు. సురభి సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్, ఉద్యాన సహాయకులు వినోదు సురభి, వాలంటీర్లు, రైతులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

వేంపల్లె : డ్రైవింగ్ శిక్షణ నేర్పే పాఠశాల యాజమాన్యం నిబంధనలను పాటించాలని పులివెందుల బ్రేక్ ఇన్స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు. గురువారం బిఎన్‌ఆర్ టెక్నికల్ డ్రైవింగ్ స్కూల్, శివ టెక్నికల్ డ్రైవింగ్ స్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ప్రసాద్ మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ లైసెన్సులు పొందాలని సూచించారు. లైసెన్సులు లేని వారు వాహనాలు నడపడం నేరమన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించడం వల్ల ప్రమాదాలను అరికట్టవచ్చని తెలిపారు. డ్రైవింగ్ స్కూల్‌లో ట్రాఫిక్ రూల్స్‌కు సంబంధించిన బ్యానర్లు ఏర్పాటు చేయాలని సూచించారు.